సాక్షి హనుమకొండ

బుధవారం | 20 | ఆగస్టు | 2025



నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో నీటి సంరక్షణ పెంచే దిశగా చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణం సత్ఫలితాలు ఇచ్చిందని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. - 8లో▸



కాళేశ్వరంలో వరద ఉధృతి

కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదులకు వరద ఉధృతి పెరుగుతోంది. 85 గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $31^{0}/23^{0}$

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో సాధారణంగా ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మహిళా క్లినిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఎంజీఎం: మహిళా ఆరోగ్య క్లినిక్‌ల ద్వారా అందించే సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య సూచించారు. గోపాల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతీ మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళా క్లినిక్‌ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా అక్కడకు వచ్చిన మహిళలను వారు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళలకు సంబంధించిన వివిధ ఆరోగ్య సమస్యల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఆస్పత్రిలోని ఫార్మసీ, ల్యాబ్, వ్యాక్సిన్ భద్రపరిచే విభాగాలు, రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలో జ్వర సర్వే, పాఠశాలల్లో, గ్రామాల్లో నిర్వహించే మెడికల్ క్యాంపుల వివరాలను వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి: హసన్‌పర్తి సంస్కృతీ విహార్‌లోని గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు వివిధ అంశాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ బాస రవి తెలిపారు. సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్‌లో (13 రోజులు), ఎలక్ట్రీషియన్, హౌజ్ వైరింగ్‌లో (30 రోజులు), మొబైల్ రిపేరింగ్‌లో (30రోజుల) పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనగామ, వరంగల్, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయస్సు, తెల్ల రేషన్ కార్డులు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల వారు నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, విద్యార్హత జిరాక్స్ పత్రాలతో ఈనెల 26 లోపు సంస్కృతీ విహార్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 26 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 98493 07873 సంప్రదించాలని మేనేజర్ రవి సూచించారు.

సీపీని కలిసిన క్రైం డీసీపీ గుణశేఖర్



వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైం డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన గుణశేఖర్ మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పూలమొక్క అందజేశారు. కమిషనరేట్ పరిధిలో చోరీలను నియంత్రించడంతో పాటు పెండింగ్ కేసుల్లో పట్టుకునేందుకు చేపట్టాల్సిన చర్యలపై సీపీ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు.

పిల్లలకు వైకల్యస్థాయి నిర్ధారణ పరీక్షలు

విద్యారణ్యపురి: జిల్లాలోని ప్రత్యేక ఉపాధ్యాయుల చేత గుర్తించిన ప్రత్యేక అవసరాల పిల్లలకు వైకల్యం స్థాయి నిర్ధారణ పరీక్షలు ఈనెల 23న హనుమకొండలోని ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో నిర్వహించనున్నట్లు డీఈవో డి.వాసంతి మంగళవారం తెలిపారు. అర్హత కలిగిన ప్రత్యేక అవసరాల పిల్లలు వారి రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు, రాష్ట్రప్రభుత్వం జారీ చేసిన 40శాతం వైకల్యం ఉన్నట్లుగా నిర్ధారించిన ధ్రువపత్రం, ప్రభుత్వ వైద్యుడు అందించిన సదరం ధ్రువపత్రం మీద హెచ్‌ఎం, మండల విద్యాధికారి సంతకం చేసిన కాపీ, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, యూనివర్సల్ డిజేబిలిటీ ఐడీ వంటి ధ్రువపత్రాలు తీసుకొనిరావాలన్నారు. ఈవైకల్య స్థాయి నిర్ధారణ క్యాంపులో భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ ఎంపిక చేసిన వైద్య బృందం ఈ క్యాంపులో పాల్గొంటుందని తెలిపారు. వారిలోని లోపాలను గుర్తించి అవసరమైన ప్రత్యేక పరికరాలను అందజేసేందుకు ఈక్యాంపును నిర్వహిస్తున్నారన్నారు. అదనపు సమాచారం కోసం జిల్లా సమ్మిళిత విద్య సమన్వయ కర్త బద్దం సుదర్శన్‌రెడ్డిని 9603672289 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

భూభారతి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్
- ధర్మసాగర్ తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీ

ధర్మసాగర్: భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ధర్మసాగర్ తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూభారతి దరఖాస్తుల రికార్డులను పరిశీలించారు. మండల పరిధిలోని రెవెన్యూ గ్రామాల వారీగా నిర్వహించిన సదస్సుల్లో భూసమస్యల కోసం వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై తహసీల్దార్, ఇతర అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సదానందం, నాయబ్ తహసీల్దార్ సంతోష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల షాపు తనిఖీ..

మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ స్నేహ శబరీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో యూరియా ఎంత స్టాక్ ఉంది? రైతులకు సరిపడా యూరియా ఇస్తున్నారా.. లేదా? అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న రైతులు యూరియా సరిపడా సరఫరా చేయాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అందరికీ యూరియా అందుతుందని కలెక్టర్ రైతులకు సూచించారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్, డీటీ సంతోష్, ఏవో రాజేష్, పీఏసీఎస్ సీఈఓ రాజిరెడ్డి, ఏఈఓ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి..

సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అరుణాదేవి, ఆయూష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీశ్వర్ ప్రసాద్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

ఆవిష్కరణలు దేశానికి ఆదర్శం

యువతకు ఆలోచనలే కీలకం

- డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖ సలహాదారు సతీష్‌రెడ్డి
- కేయూలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్రారంభం
- సావనీర్, రెండు పుస్తకాలు ఆవిష్కరణ



మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, పక్కన డాక్టర్ సతీష్‌రెడ్డి, బాలకిష్టారెడ్డి, మోహన్‌రావు తదితరులు



మాట్లాడుతున్న డాక్టర్ సతీష్‌రెడ్డి

కేయూ క్యాంపస్: విద్యార్థులు, యువత ఆవిష్కరణలు దేశానికి ఆదర్శమని డీఆర్డీఓ మాజీ చైర్మన్, కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి అన్నారు. కాకతీయ యూనివర్సిటీ స్వర్ణోత్సవం సందర్భంగా తెలంగాణ అకాడమీ సైన్సెస్, కాకతీయ యూనివర్సిటీ సంయుక్తంగా మూడు రోజులపాటు నిర్వహించే తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ మంగళవారం క్యాంపస్‌లోని ఆడిటోరియంలో ప్రారంభమైంది. తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌లో సావనీర్, రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సతీష్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇన్నోవేటివ్ స్కిల్స్ అండ్ ఎంపవర్‌మెంట్ సైన్స్ అండ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సైన్స్ కాంగ్రెస్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతీ రాష్ట్రంలో ఐఐటీ, ఐఐఎం, ఎఐఎంఎస్, నిట్స్ సెంట్రల్ యూనివర్సిటీలు ఉండడం వల్ల అనేకమంది విద్యార్థులు ఆవిష్కరణలు, పరిశోధనాపత్రాల ప్రచురణలో భారత్ ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉందన్నారు. ప్రస్తుతం 75శాతం విద్యార్థులు విదేశాలనుంచి తిరిగి వచ్చి మాతృభూమిలో ఆవిష్కరణలు చేస్తున్నారన్నారు. ఇంజనీరింగ్ పూర్తిచేసిన 90శాతం మంది ఉద్యోగాలు పొందుతున్నారన్నారు. తమ గ్రామం నుంచి తానొక్కడినే ఇంజనీరింగ్ పూర్తి చేసినట్లు గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం 1.75మిలియన్ స్టార్టప్స్ వచ్చాయన్నారు. ఏ గ్రామం, ఏకుటుంబం నుంచి వచ్చామనేది ముఖ్యం కాదని, ఏ ఆలోచన దృక్పథంతో ముందుకెళ్తున్నామన్నదే ముఖ్యమన్నారు. యువత మైండ్‌సెట్ మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ సాంకేతికతతో పోటీ పడే మనస్తత్వం రావాలన్నారు.

టీబీ నియంత్రణకు నూతన ఔషధాలు

టీబీ నియంత్రణకు నూతన ఔషధాల అభివృద్ధి తప్పనిసరి అని హైదరాబాద్ సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ కె.నందుకూరి వెల్లడించారు. తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌లో 'టీబీ మెకానిస్టిక్ ఇన్‌సైట్స్ ఇన్ టూ హౌది పాజిటివ్ పాథోజెన్ సర్వైవ్స్ ఇన్‌ది హోస్ట్' అనే అంశంపై ఆయన మాట్లాడారు. ట్యూబర్కులోసిస్‌కు కారణమైన మైక్రోబాక్టీరియం టూ బర్కులోసిస్ (ఎంటీబీ)లో ఔషధ నిరోధకత పెరుగుతుందన్నారు.

ఆధునిక రక్షణ సాంకేతికలు అభివృద్ధి

దేశ అభివృద్ధిలో రక్షణ, సాంకేతికతల పాత్ర ఎంతో కీలకమని, రక్షణరంగ పరిశోధన, అభివృద్ధి ప్రభుత్వ పెట్టుబడులు శాస్త్ర సాంకేతిక పురోగతికి ఆధునిక రక్షణ అవసరాలను తీర్చడంలో ప్రధాన పాత్రపోషిస్తాయని బెంగళూరు డీఆర్‌డీఏ ఎల్ఆర్డీఈ డైరెక్టర్ విశ్వం అన్నారు. 'ఆర్‌అండ్‌డీ డిఫెన్స్ టెక్నాలజీస్ అపార్చునిటీస్ అండ్ చాలెంజెస్-ఏ 2047 పర్స్పెక్టివ్' అనే అంశంపై ఆయన ప్రసంగించారు.

సంక్షేమమే సేవ సైన్స్ లక్ష్యం

కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

సంక్షేమమే సేవ సైన్స్ లక్ష్యం కావాలని కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. క్వాంటం ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో నూతన నూతనశాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకెళ్తున్నామన్నారు. స్వర్ణోత్సవంలోకి అడిగిడిన సందర్భంగా టాస్‌తో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహిస్తున్నామన్నారు. కేయూలో రూసా ప్రాజెక్టు కింద రూ.50కోట్లు మంజూరు కాగా, అందుకు సంబంధించిన పరిశోధనలు, ప్రాజెక్టులపై ఆచార్యులు దృష్టి సారించారన్నారు. అక్టోబర్‌లో కేయూ కె హబ్‌తో టీహబ్ ఎంఓయూ చేసుకుందని, దీనితో ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్, స్టార్టప్‌లతో ముందుకెళ్లనున్నట్లు చెప్పారు. కేయూ టాస్ జనరల్ సెక్రటరీ, ఓయూ మాజీ వీసీ సత్యనారాయణ మాట్లాడుతూ యువత సైన్స్ అండ్ టెక్నాలజీతో నూతన ఆవిష్కరణల దిశగా ముందుకెళ్లాలని సూచించారు. రిజిస్ట్రార్ రామచంద్రం, తెలంగాణ సైన్స్‌కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకట్రామ్‌రెడ్డి, టాస్ ట్రెజరర్ ప్రొఫెసర్ ఎస్‌ఎంరెడ్డి మాట్లాడారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

సెరికల్చర్ విద్యార్థుల ప్రదర్శన



పట్టుపురుగుల ప్రదర్శనలో విద్యార్థులు

కేయూలోని ఆడిటోరియం వద్ద సెరికల్చర్ విద్యార్థుల పట్టుపురుగుల ప్రదర్శన ఆకట్టుకుంది. డాక్టర్ సుజాత విశిష్టతను వివరించారు. మల్బరీ నాన్‌మల్బరీ గూడిపట్టు చీలుకులపై బోధన, పెంపకం, పరిశోధనపై నిర్వహించే అంశాలపై వివరించారు. ఇదిలా ఉండగా.. సెనెట్‌హాల్‌లో విద్యార్థులు, సైంటిస్టులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, విజ్ఞాన్‌ప్రసాద్, రామచంద్రయ్య, లక్ష్మారెడ్డి, కోఆర్డినేటర్‌గా ఆచార్య జ్యోతి పాల్గొన్నారు.

యువత నైపుణ్యాల ద్వారా సాధికారిత : ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి



యువత నైపుణ్యాల ద్వారా సాధికారిత సాధిస్తారని, భారతీయ యువత విద్య, వైజ్ఞానిక పరంగా ప్రపంచానికి పోటీ ఇస్తున్నారని ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. సైన్స్ అనేది ఒక క్రమబద్ధమైన అధ్యయనమని దేశ జనాభాలో 60శాతం యువత ఉండడం మన గర్వకారణమన్నారు. డిగ్రీతోనే ఉద్యోగాలు వచ్చే పరిస్థితులు లేవు. మల్టీ డిసిప్లినరీ కోర్సుల్లో స్కిల్స్ ఉండాల్సిందేనని అభిప్రాయ పడ్డారు.

సామాజిక పరివర్తనానికి సైన్స్ సాధనం – టాస్ అధ్యక్షుడు మోహన్‌రావు



సామాజిక పరివర్తనకు సైన్స్ ఒక సాధనమని టాస్ అధ్యక్షుడు, సీసీఎంబీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌రావు అన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేలా అకాడమీ సైన్సెస్ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. మన రక్షణ వ్యవస్థ బలమైందని ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి తెలిసిందని, కోవిడ్‌తో మన శాస్త్ర పరిజ్ఞానం ప్రపంచానికి తలమానికమైందన్నారు. తాను కేయూ పూర్వవిద్యార్థినని గుర్తు చేసుకున్నారు.







జ్యోతి ప్రజ్వలన చేస్తున్న భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖ సలహాదారు సతీష్‌రెడ్డి, గుస్సాడీ నృత్యం చేస్తున్న కళాకారులు, హాజరైన ప్రముఖులు

మరమ్మతులు చేపట్టండి

బల్దియా పాత భవనాన్ని పరిశీలించిన కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



పెచ్చులూడిన పైకప్పును పరిశీలిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

రామన్నపేట: ఇటీవల కురిసిన వర్షాలకు బల్దియా ప్రధాన కార్యాలయంలో పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న వివిధ విభాగాల్లో పైకప్పు (సీలింగ్)లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయ పురాతన భవనంతో పాటు మేయర్ చాంబర్‌పై భాగంలోని అంతస్తును కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా భవన స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల కురిసిన వర్షాలకు హెల్త్ విభాగంలోని చాంబర్‌లో పైకప్పులో నీరు చేరి సీలింగ్ కూలి కంప్యూటర్‌పై పడిన నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని కమిషనర్ పరిశీలించారు. కూలిన సీలింగ్‌తో పాటు ప్రమాదకరస్థితిలో ఉన్న సీలింగ్‌లకు మరమ్మతులు చేయించాలన్నారు. హెల్త్ విభాగంతో పాటు, బర్త్ అండ్ డెత్ విభాగాల్లో మరమ్మతులు పూర్తయ్యే వరకు ఆ విభాగాలను తాత్కాలికంగా మేయర్ చాంబర్ ఉన్న మొదటి అంతస్తులోకి తరలించాలని, పురాతన భవనంలో ప్రమాదకరస్థితిలో ఉన్న ఇతర విభాగాలను గుర్తించి వాటికి కూడా మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఈ మహేందర్, ఏంహెచ్‌ఓ డాక్టర్ రాజేశ్, పర్యవేక్షకులు ఆనంద్ పాల్గొన్నారు.

అక్రమ రవాణా కట్టడికే సాండ్‌బజార్

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- ఇందిరమ్మ లబ్ధిదారులకు అందుబాటు ధరల్లో ఇసుక : కడియం శ్రీహరి



సాండ్‌బజార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, కడియం శ్రీహరి, కలెక్టర్

మడికొండ: ఇసుక అక్రమ రవాణా కట్టడికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాండ్‌బజార్ ఏర్పాటు చేశారని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చెప్పారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని 64వ డివిజన్ ఉనికిచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన సాండ్‌బజార్‌ను హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. సాండ్ బజార్‌ల ద్వారా సరసమైన ధరకే ఇసుక లభిస్తుందన్నారు. ప్రజల అవసరాల మేరకు ఇసుకను డోర్ డెలివరీ చేస్తారని, మెట్రిక్ టన్నుకు రూ.1200లకు అందిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రూ.1,000లకు అందించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీజీఎండీసీ, ఎండీల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు అందుబాటులో నాణ్యమైన ఇసుక అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సాండ్‌బజార్‌లను ఏర్పాటు చేసినట్లు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గంలో 80శాతం వరకు ఇందిరమ్మ ఇళ్లు గ్రౌండింగ్ పూర్తి అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

కాజీపేట దర్గా ఉత్సవాలు షురూ



- కులమతాలకతీతంగా ఉర్సు ఉత్సవాలు
- రేపు అర్ధరాత్రి గంధంతో ప్రధాన ఉత్సవం ప్రారంభం
- 22న ఉర్సు, 23న బదావా (ముగింపు)
- దేశ నలుమూలలనుంచి రానున్న భక్తులు

కాజీపేట రూరల్: కాజీపేట హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబాని దర్గా ఉర్సు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. క్రీస్తుశకం 1865లో సఫర్ 26న హజరత్ భగవంతునిలో లీనమైన దినాన దర్గాను నిర్మించి ఉర్సు ఉత్సవాలను ఆరంభించి నేటికి కొనసాగిస్తున్నట్లు ముస్లిం మతపెద్దలు తెలిపారు. హిజ్రి క్యాలెండర్ ప్రకారం ప్రతీ సఫర్ నెలలో ఉత్సవాలు జరుగుతాయని, హిందు, ముస్లిం సమైక్యతకు హజరత్ సయ్యద్ షా అఫ్జల్‌బియాబాని దర్గా ఉత్సవాలు ప్రత్యేకతను చాటుతున్నాయని చరిత్ర చెబుతోంది. దర్గాను దర్శించుకొని పార్థనలతో వేడుకుంటే తమ సమస్యలు, బాధలు పోయి అనుకున్నవి జరుగుతాయని ప్రజలు నమ్మకం. ఈ ఉత్సవాలకు దేశ, విదేశాల నుంచి కులమత భేదం లేకుండా లక్షలాది మంది వస్తారని దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా తెలిపారు.

రేపు చందనోత్సవం

ఉర్సులో భాగంగా బియాబాని సమాధిని రోజ్‌వాటర్‌తో శుద్ధి చేస్తారు. 21న గురువారం అర్ధరాత్రి గంధం (సందల్) వేడుక ప్రత్యేక ఆకర్షణీయంగా నిలుస్తుంది. బడేఘర్ వద్ద ఖుస్రుపాషా కుటుంబీకులు ఆనవాయితీగా స్వయంగా గంధం చెక్కలతో గంధాన్ని తయారు చేస్తారు. ఆ రోజు రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు సందల్ వేడుకలో ఖుస్రు పాషా వెండి పాత్రలో గంధం లేపనం, వస్త్రాలను, రోజ్‌వాటర్‌ను గుర్రాలు, బ్యాండ్ మేళతాళాలతో భక్తుల మధ్య ఊరేగింపుగా తీసుకవస్తారు. అనంతరం రోజ్‌వాటర్‌తో బియాబాని సమాధిని కడిగి శుద్ధి చేసి గంధం లేపనాన్ని పూసి, పూలమాలలు, పట్టు వస్త్రాలు, సమర్పించి ఉత్సవాలు ప్రారంభిస్తారు. 22వ తేదీన ఉర్సు ఉత్సవాలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారుల సందర్శన, 23వ తేదీన బదావా ముగింపులో ఫకీర్ల విన్యాసాలు ఉంటాయి.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి –సయ్యద్ గులాం అఫ్జల్ బియాబాని ఖుస్రుపాషా, దర్గా పీఠాధిపతి



కాజీపేట దర్గా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ సహకారంతో తరలివచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం, రోడ్లు, ట్రాఫిక్, డ్రెయినేజీలు, శానిటేషన్, వైద్యం, ఉండేందుకు బస, పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశాం. మూడు రోజుల ప్రధాన ఉత్సవాలకు దేశ విదేశాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు రానున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు దర్గాను సందర్శిస్తారు.

గ్రామాల్లో సమస్యలపై మంత్రి ఓఎస్డీకి వినతులు



భీమదేవరపల్లిలో పర్యటించిన మంత్రి పొన్నం ఓఎస్డీ

ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఓఎస్డీ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. మండలంలోని రామ్‌నగర్, రంగయ్యపల్లి, రత్నగిరి, వంగర, కొప్పూర్, గాంధీనగర్, కొత్తపల్లి, భీమదేవరపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్, ఎంపీడీవో వీరేశం, ఎంపీవో నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినయ్‌రెడ్డి, ఏవో పద్మ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యకేంద్రాల్లో తనిఖీలు



క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న కౌన్సిల్ సభ్యులు

ఎంజీఎం: నగరంలోని కాశిబుగ్గ ప్రాంతంలో అర్హత లేకుండా నిర్వహిస్తున్న నకిలీ వైద్యకేంద్రాలపై మంగళవారం రాత్రి తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుల బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. తిలక్‌నగర్ ప్రాంతానికి చెందిన మామిడి ఈశ్వరయ్య అనే వ్యక్తి ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తూ డాక్టర్ అని పోస్టర్ పెట్టుకుని ఆర్‌ఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడిగా చలామణి అవుతూ రోగులను మోసం చేస్తున్నట్లు సభ్యులు వెల్లడించారు. చట్టవిరుద్ధంగా అనుమతి లేకుండా త్రివేణి క్లినిక్ నడుపుతున్నాడని తెలిపారు. ఎస్ నయీమ్ అనే వ్యక్తి ఎక్స్‌రే టెక్నీషియన్ చదివి హిజమా స్పీకింగ్ థెరపీ పేరుతో అనుమతి లేని డిగ్రీలు పెట్టుకుని పడకలు ఏర్పాటు చేసి సెలైన్ పెట్టడం, అధిక మోతాదు స్టిరాయిడ్స్, యాంటీబయోటిక్స్ రోగులకు ఇస్తున్నట్లు గుర్తించారు.

కేబుల్ వైర్ల తొలగింపు

హన్మకొండ: విద్యుత్ స్తంభాలపై అడ్డదిడ్డంగా ఉన్న కేబుల్ వైర్ల తొలగింపు ప్రక్రియను టీజీఎన్పీడీసీఎల్ అధికారులు చేపట్టారు. టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాలతో హనుమకొండ టౌన్ డీఈ, అధికారులు మంగళవారం రంగంలోకి దిగారు. విద్యుత్ స్తంభాల వెంట అడ్డదిడ్డంగా ఉన్న కేబుల్ వైర్ల తొలగిస్తుండడంతో పలు ప్రాంతాలకు కేబుల్ ప్రసారాలు, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. ఒక్కసారిగా అనుకోకుండా సేవలు నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. హన్మకొండ టౌన్ డీఈ డి.సాంబారెడ్డి, ఏడీఈ మల్లికార్జున్ కేబుల్ తొలగింపు పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. కాగా వరంగల్ టౌన్ డివిజన్ పరిధిలోని వినాయక విగ్రహాల తయారీ కేంద్రాలను వరంగల్ ఎస్ఈ కె.గౌతమ్ రెడ్డి, డీఈ (టెక్నికల్) కె.ఆనందం, వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ పరిశీలించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నిర్దేశిత లక్ష్యాన్ని సాధించాలి

న్యూశాయంపేట: వనమహోత్సవంలో భాగంగా అధికారులు నిర్దేశిత లక్ష్యాన్ని వారంలోగా సాధించాలని వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఇన్‌చార్జ్ డీఎఫ్ఓ కృష్ణమూర్తితో కలిసి మంగళవారం వనమహోత్సవంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా లక్ష్యం 31,04,272 కాగా.. ఇప్పటి వరకు 21,85,252 మొక్కలు నాటినట్లు తెలిపారు. 10,29, 230 మొక్కలకు జియోట్యాగింగ్, మేరీ లైఫ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తూ వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో వరద ఉధృతి



కాళేశ్వరం వద్ద పుష్కర ఘాట్లను తాకుతూ గోదావరి, ప్రాణహితల వరద ఉధృతి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదులకు వరద ఉధృతి పెరుగుతోంది. మంగళవారం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 10.680మీటర్ల ఎత్తులో నీటిమట్టం పెరిగి దిగువకు తరలిపోతుంది. ఎగువన కడెం, ఎల్లంపల్లినుంచి గోదావరి మీదుగా అన్నారం బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో 1.21లక్షల క్యూసెక్కులను 66 గేట్లు ఎత్తి దిగువకు కాళేశ్వరం వైపుకు తరలిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీలో 6.65లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఎగువ గోదావరి, ప్రాణహిత నదుల గుండా తరలి వస్తుంది. దీంతో బ్యారేజీలోని మొత్తం 85గేట్లు ఎత్తి నీటిని దిగువకు ఔట్‌ఫ్లో రూపంలో తరలిస్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



బాపు (ఫైల్)

కాటారం: పంట సాగు కోసం అప్పు తెచ్చి పెట్టుబడి పెడితే వర్షాలకు పంట సరిగా లేదని పెట్టుబడి తిరిగి చేతికి రాదనే మనోవేదనతో ఓ రైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం అంకుషాపూర్‌లో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లి బాపు(38), దేవక్క దంపతులు తమ ఎకరం భూమిలో వ్యవసాయం, ఇతరులకు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడాది బాపు తన ఎకరం భూమిలో పత్తి పంట సాగు చేసి రూ.70 వేలు పెట్టుబడి కోసం అప్పు చేశాడు. వర్షాల కారణంగా పత్తి పంట దెబ్బతిన్నది. దీంతో పెట్టుబడి చేతికి రాలేని పరిస్థితి ఉందని బాపు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో బాపు వ్యవసాయ పనుల నిమిత్తం రూ.1.20 లక్షలు పెట్టి ఎద్దులను కొనుగోలు చేయగా రూ.40 వేలు చెల్లించి మిగితా రూ.80 వేలకు సదరు యజమానిని సమయం కోరాడు. సోమవారం ఎద్దులు విక్రయించిన వ్యక్తి తనకు డబ్బులు అత్యవసరమని ఇంటికి రాగా పది రోజులకు ఇస్తానని చెప్పి పంపించాడు. ఈనేపథ్యంలో పెట్టుబడి కోసం తెచ్చిన అప్పు రూ.70 వేలు, ఎద్దుల బాకీ రూ.80 వేలు చెల్లించే దారిలేకపోవడంతో తీవ్రమనోవేదనతో సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య దేవక్క గమనించి కేకలు వేయగా చుట్టు పక్కల వారు వచ్చి బాపును చికిత్స నిమిత్తం భూపాలపల్లిలోని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాపు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్యతోపాటు పిల్లలు గ్రీష్మా, రిషివర్ధన్, అఖిల్ ఉన్నారు. దేవక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

ఒంటరి జీవితం గడపలేక..

- యువతి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి



మేఘన (ఫైల్)

గార్ల: 10 ఏళ్ల క్రితం తండ్రి, 2 ఏళ్ల క్రితం తల్లి మృతి చెందడంతో మనోవేదనకు గురైన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మానుకోట జిల్లా గార్ల మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పినిరెడ్డిగూడేనికి చెందిన గుగులోత్ మేఘన (17) హైదరాబాద్‌లో హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ చదువుతుంది. రాఖీ పండుగ సందర్భంగా ఇంటికి వచ్చిన యువతి అమ్మనాన్న చనిపోవడంతో మానసికంగా కృంగిపోయింది. అన్నతోపాటు, బాబాయి కుమారులకు రాఖీ కట్టిన అనంతరం ఇంటికి చేరిన ఆమె తన ఆలనాపాలనా చూసుకునే తల్లిదండ్రులు లేరని బాధపడుతూ బాత్‌రూమ్ క్లీనర్ తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన బంధువులు బైక్‌పై గార్ల సీహెచ్‌సీకి తీసుకొచ్చి ప్రథమచికిత్స అనంతరం ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి సెలైన్‌తోనే బైక్‌పై తీసుకెళ్తుండగా మార్గమధ్యలో వచ్చిన 108 అంబులెన్స్‌లో తరలించారు. వారం రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందింది. మేఘన సోదరుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రియాజ్‌పాషా వెల్లడించారు.

ప్రభుత్వ కాలేజీల్లో పెరిగిన అడ్మిషన్లు

- హనుమకొండ జిల్లా ఇంటర్ కాలేజీల్లో ఆశాజనకంగా ప్రవేశాలు
- గతేడాది కంటే 582 అడ్మిషన్లు అధికం



హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవనం

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ విద్యాసంవత్సరం అడ్మిషన్లు పెరిగాయి. జిల్లాలో 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అందులో హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 913మంది విద్యార్థులు, పరకాల ప్రభుత్వ కాలేజీలో ఇంటర్ జనరల్‌లో 67, ఒకేషనల్‌లో 211 మొత్తంగా 278, వడ్డెపల్లి ప్రభుత్వ మహిళా పింగిలి కాలేజీలో జనరల్ 267, ఒకేషనల్ 282 మొత్తంగా 549 మంది విద్యార్థులు, హనుమకొండ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో 522 మంది విద్యార్థులు, హసన్‌పర్తి ప్రభుత్వ కాలేజీలో 114 మంది విద్యార్థులు, ధర్మసాగర్ ప్రభుత్వ కాలేజీలో 274 మంది, ఆత్మకూరు ప్రభుత్వ కళాశాలలో 81మంది, శ్యాయంపేట ప్రభుత్వ కళాశాలలో 76మంది, కమలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 93 మంది మొత్తంగా ఇప్పటివరకు 2,900ల మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఇందులో ఇంటర్ జనరల్ విభాగంలో 1,885 మంది, ఒకేషనల్ కోర్సుల్లో 1,015మంది అడ్మిషన్లు పొందారు.

గతేడాదితో పోలిస్తే..

హనుమకొండ జిల్లాల్లో ఆయా 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య గతేడాది కంటే ఈవిద్యాసంవత్సరంలో కొంత మేర పెరిగింది. గత సంవత్సరం కంటే 582అడ్మిషన్లు పెరిగాయి. గత విద్యాసంవత్సరం (2024–2025) ఇంటర్ జనరల్ విభాగంలో 1,430 మంది విద్యార్థులు, ఒకేషనల్ కోర్సుల్లో 888మంది మొత్తంగా 2,318మంది విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందారు. ఈ విద్యాసంవత్సరంలో 2,900లు అడ్మిషన్లతో 582 అడ్మిషన్లు పెరిగాయి. ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఈనెలాఖరు వరకు గడువు ఉండడంతో ఇంకా కొంత మేర పెరగాల్సిన అవసరం ఉందని అధికారులు భావిస్తున్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కుటుంబానికి చేయూత



ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను మృతురాలి ఇద్దరు కూతుళ్లకు అందిస్తున్న అధికారులు

న్యూశాయంపేట: తెలంగాణ మైనారిటీ గురుకులాల విద్యాసంస్థ(టెమ్రిస్) వరంగల్ దూపకుంట రోడ్‌లోని శంభునిపేట(జీ2) బాలికల గురుకులంలో ఔట్‌సోర్సింగ్‌లో టీజీటీ ఉర్దూ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న అజ్మీరిబేగం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. గతంలో ఆమె భర్త మృతిచెందగా ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన ఆ కుటుంబానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 16 మైనారిటీ గురుకులాల ఉద్యోగులు, సిబ్బంది చేయూత అందించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రీజినల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జంగా సతీశ్, ఉమ్మడి జిల్లాలోని గురుకులాల ప్రిన్సిపల్స్ పిలుపుమేరకు టెమ్రిస్ ఉద్యోగులు రూ.5.40 లక్షలు జమ చేశారు. జమ చేసిన డబ్బులను అజ్మీరి బేగం ఇద్దరు కూతుళ్ల పేరిట మంగళవారం హనుమకొండ చౌరస్తాలోని ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్ అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి టి.రమేశ్, ఆర్‌ఎల్‌సీ డాక్టర్ సతీశ్, ప్రిన్సిపాళ్లు తాళ్ల నీలిమాదేవి, ఇ.శ్రీపాల, డి.కృష్ణకుమారి, రమేశ్‌లాల్ హట్కర్, రవికుమార్, విజిలెన్స్ అధికారులు సయ్యద్ అక్బర్, మక్బూల్‌పాషా, వార్డెన్ ఉజ్మా తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి

- రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు రాము



బాధ్యతలు స్వీకరించిన మోత్కూరి రాము, కార్యవర్గ సభ్యులు

హన్మకొండ అర్బన్ : బ్రాహ్మణుల అభ్యున్నతికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు మోత్కూరి రాము తెలిపారు. హనుమకొండకు చెందిన మోత్కూరి రాము ఇటీవల రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కాగా మంగళవారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రమాణస్వీకారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఉదయమర్రి కృష్ణమూర్తి సభాధ్యక్షత వహించగా.. మోత్కూరి రాము మాట్లాడుతూ బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తానని, బ్రాహ్మణుల్లోనూ పేదలు ఉన్నారని, వారిని అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పరంగా బ్రాహ్మణుల్లోని పేదవర్గాలకు అందాల్సిన సహకారాన్ని అందించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం చైర్మన్‌గా జగన్మోహన్ శర్మ, ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్ శర్మ, కోశాధికారిగా సముద్రాల విజయసారథి, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా గాయత్రి కులకర్ణి, జయ తులసి ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మరుమాముల వెంకటరమణ శర్మ, పాలకుర్తి గౌతం శర్మ, రాష్ట్ర అర్చక సంఘం జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలపై కేబుల్స్ తొలగించాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



వీసీ సమావేశంలో మాట్లాడుతున్న వరుణ్‌రెడ్డి

హన్మకొండ : విద్యుత్ స్తంభాలకు ఉన్న వైర్లను తొలగించాలని ఏడాది కాలంగా కేబుల్ ఆపరేటర్లకు సూచించినా పెడచెవిన పెడుతున్నారని, అన్ని సర్కిళ్ల ఎస్‌ఈలు ప్రత్యేక శ్రద్ధ కనబర్చి వాటిని తొలగించాలని టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజర్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. హనుమకొండలోని టీజీఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం 16 సర్కిళ్ల ఎస్‌ఈలు, డీఈలతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లతో విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనికి అనుగుణంగా కేబుల్ వైర్లు రీ–అలైన్‌మెంట్ చేసుకోవాలని కేబుల్ ఆపరేటర్లకు సూచించారు. స్పందించకపోతే వాటిని తొలగించాలని ఎస్‌ఈలు, డీఈలకు సూచించారు. ప్రజల భద్రత ముఖ్యమని అన్నారు. ఒక పద్ధతి ప్రకారం కేబుల్ వైర్లు అమర్చుకోవాలని సూచించారు. అధికారులు వినాయక విగ్రహాల తయారీ కేంద్రాలను సందర్శించి ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ లైన్లను క్రమబద్ధీకరించాలన్నారు. అధిక ఎత్తులో ఉన్న వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ లైన్లకు తాకకుండా లైన్లను డిస్‌కనెక్ట్ చేయాలని సూచించారు. వినాయక నిమజ్జన రూట్లను తనిఖీ చేయాలని చెప్పారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ పండుగలను విజయవంతం చేయాలన్నారు.

విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలి



వివరాలు తెలుసుకుంటున్న వరుణ్ రెడ్డి

ములుగు రూరల్: వినియోగదారులకు విద్యుత్ అంతరాయం కలకుండా చూడాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ములుగు డివిజన్ విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి సేవలు అందించాలని అన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ అధికారులు పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. ఇంటర్‌లింక్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కన్నాయిగూడెం వరకు ఇంటర్‌లింక్ పనులను విస్తరింపచేయాలని అన్నారు. నూతనంగా నిర్మిస్తున్న 33/11కేవీ సబ్‌స్టేషన్ల పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. విద్యుత్ ఉద్యోగులు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. టీజీఎన్పీడీసీఎల్ టోల్ ఫ్రీ నంబర్‌కు 1912కు సమస్యలు తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈ మల్సూర్‌నాయక్, డీఈ నాగేశ్వర్‌రావు, డీఈ సదానందం, ఏడీఈ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

జనగామలో రూ.కోటితో వ్యాపారి పరారీ

- దివాళా తీయించిన వ్యాపారం, ఆన్‌లైన్ రమ్మీ..?

జనగామ: జనగామ పట్టణంలో ఓ వ్యాపారి రూ.కోటికిపైగా అప్పులు చేసి పరారైన సంఘటన కలకలం రేపుతోంది. వ్యాపారం పేరిట అప్పులు తీసుకున్న సదరు వ్యక్తి అందులో నష్టపోవడంతో పాటు ఆన్‌లైన్ రమ్మీకి అలవాటుపడి భారీ మొత్తాన్ని కోల్పోయినట్లు ప్రచారం జరుగుతోంది. అప్పుల భారం, వ్యాపారం పూర్తిగా దివాలా తీయడంతో రెండు రోజుల క్రితం రాత్రిపూట ఉడాయించాడు. దీంతో ఆయనను నమ్మి డబ్బులు ఇచ్చిన వ్యాపారులు, సామాన్య వ్యక్తులు ఆందోళనకు గురవుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. గ్రేయిన్ మార్కెట్ ఏరియాకు చెందిన వ్యాపారి సూర్యపేట రోడ్డులో పంట ఉత్పత్తుల కొనుగోలు(చిల్లర కాంటా దుకాణం) సెంటర్ ద్వారా చింతపండు, చింతగింజలు, వేప, కందులు, పెసర్ల ద్వారా మారు వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత ఏడాది వ్యాపారి క్వింటాకు రూ.7వేల చొప్పున పెద్ద ఎత్తున కందులను కొనుగోలు చేసి నిల్వచేయగా, ధర ఒక్కసారిగా పడిపోవడంతో 40 శాతం తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వచ్చింది. దీనికి తోడు ఆన్‌లైన్ రమ్మీ ప్రభావం మరింత నష్టాల వైపు తీసుకెళ్లినట్లు పలువురు వ్యాపారులు మాట్లాడుకుంటున్నారు. రూ.2 నుంచి రూ.3 వడ్డీతో రూ.కోటి వరకు అప్పులు ఇవ్వగా.. ఒకరిద్దరు మాత్రం రూ.10లక్షల నుంచి రూ .20లక్షల ఇచ్చినట్లు సమాచారం. నెలనెలా వడ్డీ వస్తుందనే ఆశతో రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు అప్పుచ్చిన సామాన్య కుటుంబాలు, పరపతి సంఘాల ప్రతినిధులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. వ్యాపారి ఉడాయించిన ఘటన నేపథ్యంలో సదరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయాలా.. వద్దా.. అనే ఊగిసలాటలో ఉన్నారు.

మితిమీరుతోన్న ఆన్‌లైన్ రమ్మీ..

జనగామలో ఆన్‌లైన్ రమ్మీ మితిమీరుతోంది. పట్టణంలోని ప్రధాన కాలనీలు అడ్డాగా పలువు రు ఏజెంట్లు హైదరాబాద్ కేంద్రంగా ఆన్‌లైన్ రమ్మీ గేమింగ్ నడిపిస్తున్నట్లు చర్చ జరుగుతుంది. పలు వురు వ్యాపారులు, విద్యార్థులు, యువత, సామాన్యులను ప్రలోభాలకు గురిచేస్తూ రమ్మీకి బానిసలుగా మార్చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

24న చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ర్యాంకింగ్ చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి పి.కన్నా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మంటపంలో పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అండర్–7, 9, 11, 13, 15 బాలబాలికల విభాగాల్లో పోటీలు ఉంటాయని, ఇందులో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కాజీపేట మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దు

- సౌత్ ఈస్టర్న్ రైల్వేలో నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు

కాజీపేట రూరల్: సౌత్ ఈస్టర్న్ రైల్వేలో నాన్ ఇంటర్‌లాకింగ్ వర్క్స్‌తో కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లను నవంబర్‌లో రద్దు చేయనున్నట్లు మంగళవారం రైల్వే అధికారులు తెలిపారు. రద్దు చేసిన రైళ్ల వివరాలిలా ఉన్నాయి. నవంబర్ 19 నుంచి 21వ తేదీ వరకు చర్లపల్లి–షాలిమార్ (18046) వెళ్లే ఎక్స్‌ప్రెస్, నవంబర్ 20 నుంచి 21వ తేదీ వరకు షాలిమార్–చర్లపల్లి (18045) ఎక్స్‌ప్రెస్, నవంబర్ 12 నుంచి 19వ తేదీ వరకు షాలిమార్–సికింద్రాబాద్ (22849) మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్, నవంబర్ 14 నుంచి 21వ తేదీ వరకు సికింద్రాబాద్–షాలిమార్ (22850) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

గూడ్స్ షెడ్‌కు చేరిన స్పిక్ యూరియా



పూజలు చేస్తున్న ఏఓ రవీందర్, కంపెనీ ప్రతినిధులు

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్‌లోని గూడ్స్ షెడ్‌కు స్పిక్ కంపెనీ ఎరువుల వ్యాగిన్ మంగళవారం ఉదయం చేరింది. ఆ కంపెనీ రీజనల్ మేనేజర్ ఎస్.ఎం.సుభాహన్, మండల వ్యవసాయ అధికారి రవీందర్ రెడ్డి ఎరువులను పరిశీలించారు. స్పిక్ యూరియా 1,146.6 మెట్రిక్ టన్నులు, స్పిక్ 20:20:13రకం 446 మెట్రిక్ టన్నులు, స్పిక్ 10:26:26రకం 255.200 మెట్రిక్ టన్నులు చేరుకోగా.. వరంగల్ కలెక్టర్ సత్యశారద, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ సూచన మేరకు ఉమ్మడి జిల్లాలోని మార్క్‌ఫెడ్ ద్వారా 60శాతం పీఏసీఎస్‌లు, 40 శాతం ఫర్టిలైజర్ షాపులకు స్పిక్ ఎరువులను కేటాయించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి రవీందర్ రెడ్డి తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

- హనుమకొండ డీఈవో వాసంతి

విద్యారణ్యపురి: జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ డీఈవో వాసంతి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, జిల్లాపరిషత్, ఎయిడెడ్, కేజీబీవీ, టీఎస్‌ఆర్‌డబ్ల్యూఎస్, టీడబ్ల్యూహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య



రాబిన్ సన్ (ఫైల్)

ఖిలా వరంగల్: అనారోగ్య కారణాలతో జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం చింతలపల్లి –వరంగల్ రైల్వేస్టేషన్ల మధ్య జరిగిన ఈ ఘటనకు సంబంధించి జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏనుమాముల మార్కెట్ 100 ఫీట్ల రోడ్డుపై (క్రిష్టియన్) కాలనీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి పోలేపాక రాబిన్ సన్(71) బీపీ, షుగర్, కిడ్నీల సంబంధిత వ్యాధిలతో నిరంతరం బాధ పడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఉదయం చింతలపల్లి –వరంగల్ స్టేషన్ల మధ్య గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహన్ని ఎంజీఎం మార్చురీకి తరలించి పంచనామా పూర్తి చేసి మృతదేహన్ని మృతుడి భార్య హెప్సిబాకు అప్పగించినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.రవీందర్ రెడ్డి తెలిపారు.

పంటలను కాపాడుకోండిలా...

- వరుస వానలతో వ్యవసాయ భూముల్లో నిలుస్తున్న నీరు
- ఆందోళనలో అన్నదాతలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న శాస్త్రవేత్తలు



చిలుకోడు సమీపంలో పత్తిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి



నీట మునిగిన వరినారును పరిశీలిస్తున్న రైతు

దోర్నకల్: వారం రోజులుగా జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. వర్షాలతో పంటలలో నీరు నిల్వ ఉండి మొక్కలు వదలడం, నారు దశలో నీటి నిల్వతో మొక్కలు, వేర్లు కుళ్లిపోయే అవకాశం ఉంది. అధిక నీటి నిల్వతో ఎండుతెగులుతో పాటు ఇతర చీడపీడలు సోకే అవకాశాలు ఉన్నందున పలు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

పత్తి:

- సాధ్యమైనంతవరకు వర్షపు నీటిని తొలగించాలి.
- ఎరువుల యాజమాన్యంలో 15 నుంచి 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరెట్ ఆఫ్ పోటాష్‌ను వర్షం తగ్గాక వేసుకోవాలి.
- భూమిలో తేమ అధికంగా ఉంటే వేర్లు పోషకాలను తీసుకునే అవకాశం లేకపోవడంతో పైపోటుగా 20 గ్రాముల పోటాషియం నైట్రేట్‌ను పిచికారీ చేసుకోవాలి.
- తేమ వల్ల వేరుకుళ్లు రాకుండా కాపర్ ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాములను లీటర్ నీటితో కలిపి లేదా కార్బెండైజమ్ మూడు గ్రాములను లీటర్ నీటితో కలిపి మొక్క మొదళ్లలో పోయాలి.

వరి:

- వరికి సంబంధించి ప్రస్తుతం నాట్లు కొనసాగుతున్నందున వర్షపు నీరు నిలవకుండా కాలువల ద్వారా తొలగించాలి.
- నారు దశలో ఉంటే వర్షాలు తగ్గిన తర్వాత నారుమడి కొరకు 19:19:19 పోషకాన్ని 10 గ్రాములు, కార్బెండైజమ్, మాన్కోజెమ్‌లను 2.5 గ్రాములను నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- నాటు వేసేవారు ప్రతీ 2.3 మీటర్లకు 20 సెంటీమీటర్ల మేర కాలిబాటలు తీయడం వల్ల పైరుకు గాలి, వెలుతురు సోకి చీడపీడల ఉధృతి తగ్గుతుండటంతోపాటు ఎరువులు చల్లడానికి, సస్యరక్షణ చర్యలకు ఉపయోగపడుతుంది.

మిరప:

- మిరప నారుమడి దశలో ఉన్నందున వర్షపు నీటిని కాలువల ద్వారా తీసివేయాలి. నీటి నిల్వలు ఉంటే నారుకుళ్లు, ఎండుతెగులు సోకే అవకాశం ఉంది. నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటర్ నీటితో కలిపి మొక్క మొదలు తడిసేలా వేయాలి.

మొక్కజొన్న:

- వర్షాలతో పంటలో చేరిన నీటిని తొలగించాలి.
- నేల ఆరిన తర్వాత 19:19:19 లేదా 13:0:45 ఎరువును పైపాటుగా పిచికారీ చేయాలి.
- నేల ఆరిన తర్వాత అంతర్‌కృషి చేసుకుని అడుగు భాగంలో ఎరువులు వేసుకోవాలి.
- ఇతర ఆరుతడి పంటల్లో వరదనీటిని తొలగించి అంతరకృషి చేసి పైపాటుతోపాటు అడుగు భాగంలో రసాయన ఎరువులను వేసుకోవాలి.

జాగ్రత్తలు పాటించాలి



భారీ వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున రైతులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలి. పంటలతో పాటు వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ మోటార్ల వద్ద అప్రమత్తంగా ఉండాలి. వర్షం పడే సమయంలో వ్యవసాయ భూముల వద్ద చెట్లకింద ఉండకూడదు.

– క్రాంతికుమార్, వ్యవసాయ శాస్త్రవేత, కేవీకే మల్యాల

చీడపీడలను గుర్తించిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. రాబోయే రోజుల్లో వర్షాలు పెరిగే అవకాశాలు ఉన్నందున పంటలలో కాల్వలు ఏర్పాటు చేసుకోవాలి. విద్యుత్ తీగలు, మోటార్లు, స్టార్టర్ల ఏర్పాటులో పూర్తిస్థాయి జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ తీగలను నేరుగా తాకవద్దు. వర్షంపడే సమయంలో చెట్ల క్రింద నిలబడకుండా ఇంటికి వెళ్లిపోవాలి.

గంజాయి వ్యాపారం చేస్తున్న తండ్రీకొడుకులు

- 1.4 కిలోల ఎండు గంజాయి స్వాధీనం
- తండ్రి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్సై రమేష్‌బాబు



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై

నెల్లికుదురు: తండ్రీకొడుకులు కలసి అక్రమంగా విక్రయించేందుకు తరలిస్తున్న ఎండు గంజాయిని మానుకోట జిల్లా నెల్లికుదురు పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. క్రాస్ రోడ్ వద్ద ఉదయం పెట్రోలింగ్ చేస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతన్ని విచారించగా.. జనగామ జిల్లా కొడకండ్ల మండలం రేగులకు చెందిన కేలోత్ చందా (కేలోత్ చందూలాల్) తన చిన్న కొడుకు కేలోత్ నవీన్‌తో కలసి తక్కువ ధరకు రాజమండ్రి నుంచి గంజాయి తీసుకొచ్చి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తేలింది. దీంతో అతని వద్ద ఉన్న రూ.70 వేల విలువ చేసే 1.4కిలో గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చందాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

వరిపొలంలో పడి రైతు మృతి



నవీన్ (ఫైల్)

మామునూరు: ఒరాలు చెక్కుతూ అకస్మాత్తుగా లోతైన వరి పొలం బురదలో ప్రమాదవశాత్తు పడడంతో రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ 17వ డివిజన్ గాడిపెల్లికి చెందిన అమ్మ నవీన్(36) ఇంటి పక్కనే ఉన్న వరి పొలంలో ఒరాలు చెక్కేందుకు వెళ్లాడు. ఇంటిలో జరుగుతున్న ఓ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు మధ్యాహ్నం నవీన్ భార్య ఇందుమతి ఫోన్ చేయగా రింగ్ అవుతున్నా.. లిఫ్ట్ చేయలేదు. దీంతో కుటుంబ సభ్యులతో కలిసి పొలం వద్దకు వెళ్లగా నవీన్ బురదలో పడి మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న మామునూరు ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి భార్య ఇందుమతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి

- 49వ ఎడిషన్ వాటర్ సిరీస్ వెబ్‌నార్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషా
- ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రోగ్రాం



మాట్లాడుతున్న జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: జనగామ జిల్లాలో నీటి సంరక్షణ పెంచే దిశగా చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణం సత్ఫలితాలు ఇచ్చిందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. జలశక్తి అభియాన్‌లో భాగంగా రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రంనుంచి జనగామ జిల్లా కలెక్టర్లతో మంగళవారం మంత్రిత్వశాఖ–జాతీయ జల మిషన్ డైరెక్టర్ అర్చన వర్మ ఆధ్వర్యంలో 49వ ఎడిషన్ వాటర్ సిరీస్ వెబ్‌నార్ సందర్భంగా జలశక్తి అభియాన్ ప్రగతిపై ఢిల్లీ నుంచి వర్చువల్‌గా వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జనగామ కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో జలసంరక్షణపై దృష్టి సారించడంతో వ్యవసాయ రంగంలో అధిక దిగుబడులు సాధించడంతోపాటు వ్యవసాయేతర రంగాల ఉత్పత్తులపై పట్టు సాధించామన్నారు. ఇంటింటికి ఇంకుడుగుంత నినాదంతో ఉద్యమంలా చేపట్టిన కార్యక్రమంతో ఐదు మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగినట్లు తెలిపారు. వరిసాగులో అత్యధిక దిగుబడి సాధించగా, ఇదే స్ఫూర్తితో వరికి ప్రత్యామ్నాయంగా పామాయిల్ సాగుపై ఫోకస్ పెట్టినట్లు తెలిపారు. 7వేల ఎకరాలకు పైగా పామాయిల్ తోటల సాగు లక్ష్యాన్ని చేరుకోగలిగినట్లు చెప్పారు. దేవాదుల ద్వారా ప్రాజెక్టులు, చెరువులకు నీటిని నింపినట్లు చెప్పారు. రెండేళ్లుగా మత్స్యకారులు చేపల పెంపకంతోపాటు మార్కెటింగ్ పరంగా రూ.300కోట్ల నుంచి రూ.350 కోట్ల మేర వ్యాపారంతో సాధికారత సాధించారన్నారు. అనంతరం అర్చన వర్మ మాట్లాడుతూ జనగామ జిల్లా పురోగాభి వృద్ధికి కృషి చేస్తున్న కలెక్టర్‌తోపాటు జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.